నమస్తే తెలంగాణ


## స్టడీ పర్మిట్లకు కెనడా కోత

**భారత విద్యార్థులపై ప్రభావం**

ఒట్టావా, సెప్టెంబర్ 19: విదేశీ విద్యార్థుల స్టడీ పర్మిట్లను తగ్గించనున్నట్టు కెనడా ప్రకటించింది. 'ఈ ఏడాది 35 శాతం తక్కువగా అంతర్జాతీయ స్టడీ పర్మిట్లను మంజూరు చేస్తున్నాం. వచ్చే ఏడాది ఈ సంఖ్య మరో 10 శాతం తగ్గనుంది. వలస మా ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనకరమే. కానీ కొందరు ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసి విద్యార్థుల ప్రయోజనాన్ని పొందినప్పుడు దాన్ని కట్టడి చేస్తాం' అని కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో బుధవారం స్పష్టంచేశారు. తాత్కాలిక నివాసితుల సంఖ్యను తగ్గించాలని కెనడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది. భారత విద్యార్థులు కెనడాలో ఉన్నత విద్యాభ్యాసానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లను తగ్గించాలన్న ఆ దేశ నిర్ణయం చాలా మంది భారత విద్యార్థులపై ప్రభావం చూపనుంది.



## తొలి కశ్మీర్ ముస్లిం ఐఏఎస్ అధికారి మహమ్మద్ షఫీ మృతి

శ్రీనగర్, సెప్టెంబర్ 19: తొలి కశ్మీర్ ముస్లిం ఐఏఎస్ అధికారి మహమ్మద్ షఫీ పండిట్ (80) కన్నుమూశారు. గత కొద్దికాలంగా అస్వస్థతతో ఢిల్లీలో చికిత్స పొందుతున్న ఆయన.. గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని శ్రీనగర్‌కు తీసుకువెళ్లారు. 1969లో సివిల్ సర్వీస్ పరీక్షలకు అర్హత సాధించిన తొలి ముస్లింగా పేరొందిన ఆయన చివరిగా జమ్ముకశ్మీర్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సేవలందించారు. పండిట్ మండల కమిషన్ నివేదికలో కీలక పాత్ర పోషించారు ప్రభు త్వ సంయుక్త కార్యదర్శిగా సేవలందించారు.

**మనుషుల్లో 3,600కు పైగా**

## ఫుడ్ ప్యాకేజింగ్ రసాయనాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఆహార ప్యాకేజీ లేదా తయారీలో వాడే 3,600కు పైగా రసాయనాలను మనుషుల శరీరాల్లో గుర్తించినట్టు జర్నల్ ఆఫ్ ఎక్స్‌పోజర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఎపిడెమియాలజీలో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. ఇందులో సుమారు 100 దాకా ఆరోగ్యానికి హానికరమైనవి ఉన్నాయని అధ్యయనానికి నేతృత్వం వహించిన బిర్గిట్ గుయెకా తెలిపారు. వీటిలో పీఎఫ్ఏఎస్, బిస్ఫెనాల్ ఎ లాంటి నిషేధిత జాబితాలో ఉన్న రసాయనాలు ఉన్నాయన్నారు. గతంలో సుమారు 14 వేల ఫుడ్ కాంటాక్ట్ కెమికల్స్‌ను పరిశోధకులు గుర్తించారు. ఇవి వివిధ రకాల ప్యాకేజింగ్ పదార్థాలు, వంట పాత్రల నుంచి ఆహారంలో కలిసిపోయే సామర్థ్యం ఉన్నవి. అయితే తాజాగా కనుగొన్న 3600 రసాయనాలు ఫుడ్ ప్యాకేజింగ్ ద్వారానే శరీరంలోకి చొచ్చుకు వెళ్లాయని అధ్యయనం తేల్చలేకపోయిందని.. ఇందుకు ఇతర కారణాలు ఉండొచ్చని గుయెకా అభిప్రాయపడ్డారు. పీఎఫ్ఏఎస్ రసాయనాలకు అనేక ఆరోగ్య సమస్యలకు సంబంధం ఉందని తెలిపారు. ప్యాకేజీ సామగ్రిని ఎక్కువ సేపు వాడొద్దని, ప్యాకేజ్డ్ ఆహారాన్ని వేడి చేయడాన్ని నివారించాలని ఆమె ప్రజలకు సలహా ఇచ్చారు.

# ఇక టార్గెట్ హెజ్బొల్లా!

- గాజాలో తగ్గిన యుద్ధ తీవ్రత
- లెబనాన్ వైపు ఇజ్రాయెల్ సైన్యం
- పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధం!





**లెబనాన్‌లో వాకీటాకీలు పేలాయని భావించిన ఓ మొబైల్స్ దుకాణం ముందు గుమికూడిన స్థానికులు**

జెరూసలేం, సెప్టెంబర్ 19: హెజ్బొల్లాపై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నది. గత ఏడాదికాలంగా గాజాలో హమాస్‌పై పోరాడుతున్న ఇజ్రాయెల్ ఇప్పుడు హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకున్నది. గాజాలో యుద్ధ తీవ్రత తగ్గడంతో ఇప్పుడు హెజ్బొల్లాకు కేంద్రమైన లెబనాన్ సరిహద్దుకు బలగాలను మోహరిస్తున్నది. గాజాలో జరిగిన పోరులో కీలకంగా వ్యవహరించిన వేలాది మంది సైనికులతో కూడిన 98వ డివిజన్‌ను లెబనాన్ వైపు పంపిస్తున్నది. రెండు రోజులుగా హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా పేజర్లు, వాకీటాకీలు, ఇతర పరికరాలు పేలుతున్న ఘటనల వెనుక కూడా ఇజ్రాయెల్ ఉందని హెజ్బొల్లా ఆరోపిస్తున్నది. మరోవైపు 'యుద్ధంలో కొత్త దశ మొదలైంది' అంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యావ్ గాల్లంట్ ప్రకటించారు. హెజ్బొల్లాను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోనున్నదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

**2006 తర్వాత మళ్లీ యుద్ధం?**

గత ఏడాది అక్టోబరు 8 నుంచి హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నప్పటికీ ఇరుపక్షాలు పూర్తిస్థాయి యుద్ధానికి దిగలేదు. ఏడాదిగా ఇప్పటివరకు ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో 500 మందికి పైగా మరణించారు. హెజ్బొల్లా దాడుల్లో 23 మంది ఇజ్రాయెల్ సైనికులు, 26 మంది ప్రజలు మరణించారు. కాగా, 2006లోనూ ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య 34 రోజుల పాటు జరిగిన యుద్ధంలో హెజ్బొల్లా తీవ్రంగా నష్టపోయింది. అయితే, అప్పటి నుంచి హెజ్బొల్లా కూడా యుద్ధ సామర్థ్యాలను పెంచుకుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రస్తుతం హెజ్బొల్లా దగ్గర 1,50,000 రాకెట్‌లు, క్షిపణులు ఉన్నాయని, ఇజ్రాయెల్ భూభాగంలో ఏ ప్రాంతంపైనైనా లక్షిత దాడులు చేసే సామర్థ్యమూ హెజ్బొల్లాకు ఉందని యుద్ధ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య యుద్ధం జరిగితే ఇరువైపులా నష్టం భారీగానే ఉండే అవకాశం ఉంది.

**బందీలందరినీ విడుదల చేస్తే యుద్ధం ఆపేస్తాం**

ఇజ్రాయెల్-హమాస్ మిలిటెంట్ల మధ్య నెలల తరబడి జరుగుతున్న యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అటు ఇజ్రాయెల్ కానీ, ఇటు హమాస్ కానీ ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. ఫలితంగా వేలాదిమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. గాజాస్ట్రిప్ శవాల దిబ్బగా మారుతున్నది. అక్కడి ప్రజలు నిత్యం బిక్కుబిక్కుమంటూ క్షణమొక యుగంగా గడుపుతున్నారు. యుద్ధాన్ని నివారించేందుకు ప్రపంచ దేశాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోగా పరిస్థితులు రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ తనంత తానే ఓ సరికొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. తమ వద్దనున్న బందీలందరినీ ఒకేసారి విడుదల చేస్తే గాజా స్ట్రిప్‌లో యుద్ధాన్ని విరమిస్తామంటూ హమాస్‌కు ఆఫర్ ఇచ్చింది. అంతేకాదు, ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలందరినీ విడిచిపెట్టడంతోపాటు గాజా స్ట్రిప్ నుంచి తమ మిలటరీని వెనక్కి పిలిపిస్తామని, గాజాలో కొత్త పాలనా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించింది.

## పేజర్ పేలుళ్లు యుద్ధ ప్రకటనే

**ఇజ్రాయెల్‌ది ఉగ్రవాద చర్య**


హెజ్బొల్లా నాయకుడు నస్రల్లా

బీరుట్, సెప్టెంబర్ 19: పేజర్లు, వాకీటాకీలు పేల్చేయడం ఇజ్రాయెల్ చేపట్టిన ఉగ్రవాద చర్య అని హెజ్బొల్లా నాయకుడు హస్సన్ నస్రల్లా పేర్కొన్నారు. ఇది లెబనాన్ ప్రజలు, దేశ సార్వభౌమాధికారంపై యుద్ధాన్ని ప్రకటించడమేనని అన్నారు. లెబనాన్‌లో హెజ్బొల్లా లక్ష్యంగా పేజర్లు, వాకీటాకీలు పేలిన తర్వాత నస్రల్లా మొదటిసారి మాట్లాడారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడిందని, అన్ని హద్దులూ దాటిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ ప్రజలు ఉండే దవాఖానలు, మార్కెట్‌లు, దుకాణాలు, ఇండ్లు, వీధుల్లో ఇజ్రాయెల్ పేలుళ్లు జరిపిందని అన్నారు. ఇందుకు ఇజ్రాయెల్‌కు అమెరికా కూడా సాంకేతికంగా సహకరించిందని ఆరోపించారు. పేజర్ల పేల్చివేతతో నాలుగు వేల మందిని చంపాలని ఇజ్రాయెల్ ప్రయత్నించిందని అన్నారు. కాగా, పేజర్లు, వాకీ టాకీల పేలుళ్లలో 37 మంది మరణించారని, 287 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రి ఫిరాస్ అబైద్ తెలిపారు. విమానాల్లో పేజర్లు, వాకీ టాకీలపై లెబనాన్ నిషేధం విధించింది.

**లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు**

హెజ్బొల్లా నాయకుడు నస్రల్లా ప్రసంగించిన వెంటనే లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దళాలు దాడులు ప్రారంభించాయి. హెజ్బొల్లా ఉగ్రవాద సామర్థ్యాలు, సదుపాయాలను నిర్వీర్యం చేసేందుకు దాడులు చేస్తున్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ప్రకటించింది. ఉత్తర ఇజ్రాయెల్‌లో రక్షణను పటిష్ఠం చేయడమే ఈ దాడుల లక్ష్యమని తెలిపింది.


## పేజర్ల పేలుళ్ల వెనుక 'యూనిట్ 8200'?




లెబనాన్‌లో హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా జరిగిన పేజర్లు, వాకీటాకీల పేలుళ్లు యుద్ధరంగ నిపుణులను కూడా ఆశ్చర్యపరిచాయి. ఏకకాలంలో వందలాది వైర్‌లెస్ పరికరాలను ఎలా పేల్చేశారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఈ దాడికి పాల్పడింది ఇజ్రాయెల్ అనే అనుమానాలు బలంగా ఉన్నాయి. అయితే, ఈ దాడులకు ప్రణాళిక, అమలు అంతా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్‌కు చెందిన 'యూనిట్ 8200' పనేనని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ పేలుళ్లపై ఏడాది కాలంగా 'యూనిట్ 8200' పని చేస్తున్నదని, 5,000 పేజర్లలో తయారీ సమయంలోనే చిన్న మొత్తంలో పేలుడు పదార్థాలు అమర్చిందని తెలుస్తున్నది. అత్యాధునిక సాంకేతికతలపై పట్టుండే మెరికల్లాంటి యువతీ యువకులను 'యూనిట్ 8200'కు ఎంపిక చేస్తారు. సైబర్ దాడుల నుంచి రక్షణ కోసం దీనిని ఏర్పాటు చేసినా తర్వాత సాంకేతికత దాడులు, స్ట్రైక్స్ చేసేలా ఇజ్రాయెల్ మార్చింది. అధునాతన సాంకేతికతలను వినియోగించి ఎవరూ కలలో కూడా ఊహించని దాడులను 'యూనిట్ 8200' చేపట్టగలదట. ఇరాన్ అణు ప్రయోగాలను నిర్వీర్యం చేయడంలోనూ దీని పాత్ర ఉందనే కథనాలు ఉన్నాయి.

## మానవాళి అంతర్ధానం కాకుండా..!

- 5డీ క్రిస్టల్‌లో మనిషి జన్యువు చేర్పు
- సుమారు 13.8 బిలియన్ ఏండ్లు చెక్కుచెదరకుండా జీనోమ్ డాటా
- సౌతాంప్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం అద్భుతం



లండన్, సెప్టెంబర్ 19: భూమిపై మానవాళి అంతరించిపోతే? దీనికి సమాధానంగా బ్రిటన్‌లోని సౌతాంప్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం.. సైన్స్ ఫిక్షన్‌ను తలపించే ఆవిష్కరణ చేశారు. మనిషి జన్యువులను ఒక '5డీ మెమరీ క్రిస్టల్'లో భద్రంగా దాచిపెట్టారు. అంతరించే జాతిని తిరిగి రప్పించాలన్న సంకల్పంతో.. ఆస్ట్రియాలోని హాల్‌స్టాట్‌లో ఉన్న ఓ గుహలో భద్రంగా ఉంచారు. 360 టెరాబైట్ల మెమరీ కలిగిన ఆ క్రిస్టల్ ఎంత పటిష్ఠం అంటే.. 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను, గడ్డకట్టే చలిని సైతం తట్టుకుంటుంది. 13.8 బిలియన్ సంవత్సరాల వరకు డాటా భద్రంగా ఉంటుంది. ఒకవిధంగా చెప్పాలంటే ఆ క్రిస్టల్ క్వార్ట్జ్‌లా అత్యంత గట్టిదనం కలిగినది. ఈ 5డీ క్రిస్టల్‌లో జన్యువును దాచేందుకు అల్ట్రా ఫాస్ట్ లేజర్లను ఉపయోగించారు. శాస్త్రవేత్తల ఘనతకుగానూ గిన్నిస్ బుక్‌లో చోటు కూడా దక్కింది.

**5డీ మెమరీ క్రిస్టల్ విశేషాలివీ..**

- తొలి 5డీ మెమరీ క్రిస్టల్‌ను 2014 జనవరి 23న యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ శాస్త్రవేత్తలు తయారుచేశారు.
- గది ఉష్ణోగ్రత వద్ద 300 క్విం‌ట్రిలియన్ సంవత్సరాల వరకు చెక్కు చెదరకుండా ఉంటుంది.
- సాధారణంగా దీని జీవిత కాలం 13.8 బిలియన్ సంవత్సరాలు (అంటే.. ప్రస్తుతం మన విశ్వం వయసు అన్నమాట).

## భారత్‌కు అమెరికా కోర్టు సమన్లు

- సివిల్ దావా వేసిన ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూ
- తన హత్యకు ప్రయత్నించినట్టు ఆరోపణలు
- ప్రధాని మోదీకీ తెలిసే జరిగిందని వాదన
- తీవ్రంగా తప్పుబట్టిన భారత విదేశాంగ శాఖ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ దాఖలు చేసిన సివిల్ దావాపై భారత ప్రభుత్వానికి అమెరికా కోర్టు సమన్లు జారీ చేసింది. తన హత్యకు భారత ప్రభుత్వం, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, రా మాజీ చీఫ్ సమంత్ గోయెల్, రా అధికారి విక్రమ్ యాదవ్, భారతీయ వ్యాపారవేత్త నిఖిల్ గుప్తాతో పాటు ప్రస్తుతం అమెరికా జైలులో ఉన్న ఓ భారతీయుడు సహా గుర్తు తెలియని ఇతరులు ప్రయత్నించారని పన్నూ న్యూయార్క్‌లోని సదరన్ డిస్ట్రిక్ కోర్టును ఆశ్రయించాడు. ఈ ప్రణాళిక గురించి ప్రధాని నరేంద్ర మోదీకి కూడా తెలుసని ఇందులో ఆరోపించాడు. 'నవ భారత్ ఇప్పుడు శత్రువుల ఇండ్లకు వెళ్లి మట్టుబెడుతుంది' అని ఏప్రిల్‌లో జరిగిన ఓ ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడిన అంశాన్నీ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. తన హత్య ప్రణాళిక విఫలమైనప్పటికీ తాను అనుభవించిన మానసిక ఆందోళనకుగానూ పరిహారం చెల్లించేలా ఆదేశించాలంటూ పన్నూ కోర్టును కోరాడు. పన్నూ పిటిషన్‌పై స్పందించిన కోర్టు.. భారత ప్రభుత్వం, అజిత్ దోవల్, సమంత్ గోయెల్, విక్రమ్ యాదవ్, నిఖిల్ గుప్తాకు 21 రోజుల్లో స్పందన తెలియజేయాల్సిందిగా సమన్లు జారీ చేసింది.

**పూర్తిగా అసమంజసం: భారత్**

భారత ప్రభుత్వానికి అమెరికా కోర్టు సమన్లు జారీ చేయడం పూర్తిగా అసమంజసమని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి పేర్కొన్నారు. 'ఈ విషయం(పన్నూ హత్యాయత్నం) గురించి మా దృష్టికి రాగానే మేము స్పందించాం. ఉన్నత స్థాయి కమిటీ ఈ విషయంపై విచారణ జరుపుతున్నది. పిటిషన్ దాఖలు చేసిన పన్నూ చరిత్ర అందరికీ తెలిసిందే. అతడు చట్టవ్యతిరేక, ర్యాడికల్ సంస్థ అయిన సిక్స్ ఫర్ జస్టిస్‌కు చెందిన వ్యక్తి. 2020లో అతడిని భారత్ ఉగ్రవాదిగా గుర్తించింది' అని మిస్రి వ్యాఖ్యానించారు.

## ఎన్డీయే సర్కారు ఎప్పుడైనా కూలొచ్చు

- మోదీ ప్రభుత్వం పూర్తికాలం ఉండదు
- నితీశ్‌కుమార్-చంద్రబాబు ఎప్పుడైనా మద్దతు ఉపసంహరించుకోవచ్చు
- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



బెంగళూరు, సెప్టెంబర్ 19: కేంద్రంలోని ఎన్డీయే సర్కారు ఏ క్షణమైనా కూలొచ్చని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య జోస్యం చెప్పారు. మోదీ ప్రభుత్వం ఐదేండ్ల పదవీ కాలాన్ని పూర్తి చేయలేదని ఆయన అన్నారు. 'భవిష్యత్‌పై జోస్యం చెప్పడంపై నాకు నమ్మకం లేదు. అయినప్పటికీ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల ఆధారంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఐదేండ్ల పాటు పాలన చేయలేదని కచ్చితంగా చెప్పగలను' అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు దేశం పార్టీ, బీహార్‌లోని జేడీ(యూ) సహాయంతో మోదీ ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నారని, వారు ఏ క్షణంలోనైనా తమ మద్దతు ఉపసంహరించుకోవచ్చునని ఆయన అన్నారు. కర్ణాటకలో తన నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ చేస్తున్న ఆరోపణలను ఆయన ప్రస్తావిస్తూ తమకు 136 సీట్లు ఉన్నాయని, అలాంటప్పుడు ప్రభుత్వం ఎలా మారుతుందని ప్రశ్నించారు. బీజేపీ చేస్తున్న అలాంటి విమర్శలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వమని సిద్ధరామయ్య అన్నారు.

**మౌఖిక ఆదేశాల పనులపై నివేదిక కోరిన గవర్నర్**

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మౌఖిక ఆదేశాలపై రూ.387 కోట్ల వ్యయంతో జరిగిన పనులపై నివేదిక అందజేయాలని కర్ణాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రాజ్‌నీశ్‌ను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఆదేశించారు. సిద్ధరామయ్య సొంత నియోజకవర్గమైన వరుణతో పాటు శ్రీరంగపట్నలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టిందని పీఎస్ నాగరాజు అనే వ్యక్తి తనకు ఫిర్యాదు చేసినట్టు గవర్నర్ తన లేఖలో పేర్కొన్నారు. ముడా వద్ద నిధులు లేకపోయినా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మౌఖిక ఆదేశాలతోనే నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులు చేపట్టిందని తన దృష్టికి తెచ్చినట్టు చెప్పారు. ఇది తీవ్రమైన అంశమని, దీనిపై డాక్యుమెంట్లతో పాటు సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను గవర్నర్ ఆదేశించారు. కాగా, ఇప్పటికే ముడా భూకుంభకోణం కేసులో సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ అనుమతిని ఇచ్చిన సంగతి తెలిసిందే. గవర్నర్ నిర్ణయాన్ని సిద్ధరామయ్య హైకోర్టులో సవాల్ చేయగా, తీర్పు రిజర్వులో ఉంది.

## ఉక్రెయిన్‌కు భారత్‌లో తయారైన ఆయుధాలు!

**దిగుమతి చేసుకుంటున్న ఐరోపా దేశాలు**

'రాయిటర్స్'లో కథనం.. ఖండించిన భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: భారత్‌లో తయారైన ఆయుధాలు, యుద్ధసామాగ్రిని రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ వినియోగిస్తున్నదని 'రాయిటర్స్' సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇటలీ, చెక్ రిపబ్లిక్ వంటి ఐరోపా దేశాలు భారతీయ తయారీదారుల నుంచి ఆయుధాలు, ఇతర యుద్ధసామాగ్రిని కొనుగోలు చేసి ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తున్నట్టు ఈ కథనం పేర్కొన్నది. ఆయుధాల ఎగుమతి అంశాన్ని రష్యా రెండుసార్లు భారత్ ముందు లేవనెత్తిందని, జూలైలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు రష్యా మంత్రి సెర్గీ లావ్రోవ్ ఈ విషయాన్ని చెప్పారని తెలిపింది. కాగా, ఈ కథనాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం తీవ్రంగా ఖండించారు. ఉనికిలో లేని ఉల్లంఘనలకు భారత్ పాల్పడిందని ఈ కథనం పేర్కొన్నదని, ఇది కేవలం ఊహాజనితమైనదని, తప్పుదోవ పట్టించేదని అన్నారు.

## దళితుల ఇండ్లకు నిప్పు

- బీహార్‌లోని నవాడా జిల్లాలో దారుణం
- 34 ఇండ్లను తగలబెట్టిన దుండగులు
- జంగిల్ రాజ్ పాలనకు నిదర్శనం
- నితీశ్ సర్కార్‌పై విపక్షాల ఆగ్రహం


**దళితుల ఇండ్లు దహనమైన చోట చెల్లాచెదురుగా పడి ఉన్న ఇంటి వస్తువులు**

నవాడా, సెప్టెంబర్ 19: బీహార్‌లో దారుణం చోటు చేసుకుంది. దళితులకు చెందిన 34 ఇండ్లను దుండగులు తగలబెట్టారు. దీంతో పేద దళితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. నవాడా జిల్లా మంజి తోలలోని తోల ముఫాసిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందులో ఎవరూ గాయపడలేదని, దీనికి కారకులుగా భావిస్తూ 15 మందిని అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ దారుణాన్ని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఖండించారు. వెంటనే ఘటనా స్థలికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని అడిషనల్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)ను ఆదేశించారు. దీనిపై సిట్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. కాగా, బీహార్‌లో జంగిల్ రాజ్ పాలనకు ఇది మరో నిదర్శనమని కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే విమర్శించారు. బహుజనులకు వ్యతిరేకంగా రాష్ట్రంలో జరిగిన మరో అన్యాయమని విపక్షాలు విమర్శించాయి. దహనమైన ఇండ్లు 80 వరకు ఉన్నాయని కాంగ్రెస్ తెలిపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కొంత మంది వ్యక్తులు రాత్రి ఏడు గంటలకు వచ్చి గాలిలోకి కాల్పులు జరిపి తమ ఇండ్లను తగులబెట్టారని చెప్పారు. కాగా, భూ వివాదమే దీనికి కారణంగా భావిస్తున్నట్టు ఎస్పీ అభినవ్ దిమాన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే బాధితుల తాత్కాలిక నివాసానికి టెంట్లు ఏర్పాటు చేశామని, ఆహారం, మంచి నీరు, ఇతర నిత్యావసరాలు సరఫరా చేసినట్టు చెప్పారు. దళితుల ఇండ్ల దహనాన్ని కేంద్ర మంత్రి జితిన్ రాం మాంఝీ, బీఎస్పీ అధినేత్రి మాయావతి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఖండించారు.

**శాంతిభద్రతలు కుప్పకూలాయి: లాలూ**

బీహార్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని, ఇది కచ్చితంగా నితీశ్ కుమార్ పాలనా వైఫల్యమేనని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. 'మీ హయాంలో దళితుల ఇండ్లను దుండగులు తగులబెడుతున్నారు. దీనిపై మీరు కానీ, నితీశ్ ప్రభుత్వం కానీ ఎందుకు మాట్లాడరు' అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు.



## అధిక పని ఒత్తిడితో ఈవై ఉద్యోగిని మృతి!

**కంపెనీపై బాధితురాలి తల్లి ఆరోపణలు**

దర్యాప్తు జరుపుతామన్న కేంద్ర కార్మికశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: 'ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా' కంపెనీలో పనిచేస్తున్న చార్టెడ్ అకౌంటెంట్ (26) అన్నా సెబాస్టియన్ పెరియాలి మృతి సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆమె మృతిపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాల్ని తేల్చేందుకు విచారణ చేపట్టబోతున్నామని కేంద్ర కార్మిక శాఖ గురువారం 'ఎక్స్' వేదికగా తెలిపింది. సెబాస్టియన్ తల్లి అనిత చేసిన ఫిర్యాదును స్వీకరిస్తున్నట్టు కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే 'ఎక్స్'లో వెల్లడించారు. దేశంలో ఎంతోమంది యువతీ యువకులు కలలుగంటున్న 'సీఏ'ను సెబాస్టియన్ డిస్టింక్షన్‌లో పాసయ్యారు. పుణేలోని 'ఈవై గ్లోబల్' కంపెనీలో ఈ ఏడాది మార్చి 18న చేరారు. ఛాతిలో నొప్పితో జూలై 20న హఠాత్తుగా ఆమె చనిపోయారు. ఆమె మరణం.. తల్లిదండ్రుల్ని షాక్‌కు గురిచేసింది. కంపెనీలో నాలుగు నెలలు రాత్రిపగలు తన కూతురుపై పని భారం మోపారని, సరిగా నిద్ర పోనివ్వకుండా అధిక పని ఒత్తిడి వల్లే ఆమె మరణించిందని తల్లి అనిత ఆరోపిస్తున్నారు.

## సిస్కోలో 5,600 మందిపై వేటు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: టెక్ దిగ్గజ సంస్థ సిస్కో ఈ ఏడాది రెండో విడత లేఆఫ్‌లు ప్రకటించింది. సిబ్బందిలోని 7 శాతం అనగా, 5,600 మందిని తొలగించాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ కంపెనీ 4 వేల మందికి పైగా ఉద్యోగులను తీసేసింది. తాజా లేఆఫ్‌లలో ఏయే శాఖల ఉద్యోగులను ఇంటికి పంపుతారన్న విషయంపై స్పష్టత లేదు. కంపెనీ వర్గాలు తప్పుడు సమాచారం ప్రచారం చేయడం పట్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# మరణమే చివరి అంకం కాదు!

- చావు తర్వాత కూడా మూడో దశ ఉంది
- జీవి మరణించినా ప్రాణంతోనే కణాలు
- త్వరలో తేలిపోనున్న చావు రహస్యం?!



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): భూమి మీద పడగానే పుట్టుక మొదలవుతుందా? లేదా తల్లి కడుపులో పిండం జీవం పోసుకోగానే జననం ప్రారంభమైనట్టా? తుది శ్వాస విడిచాక మరణాన్ని ధ్రువీకరిస్తామా? బ్రెయిన్ డెడ్ అయ్యాక చావును డిసైడ్ చేస్తామా? మనిషి పుట్టుక, చావులోనే ఇన్ని సందేహాలున్నాయి అనుకొంటే.. జీవం, మరణం మాత్రమే కాకుండా మూడో దశ కూడా ఉన్నదని అమెరికా శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. అసలేమిటీ దశ? దాన్ని ఎలా నిర్ధారించారు?

**ఏమిటీ మూడో దశ?**

ఏ ప్రాణికి అయినా జీవం, మరణం అనే రెండు దశలే ఉంటాయని ఇప్పటివరకూ అనుకొన్నాం. అయితే, పుట్టుక, చావు మాత్రమే కాదు మూడో దశ కూడా ఉన్నదని పరిశోధకులు చెప్తున్నారు. వివరంగా చెప్పాలంటే.. గుండె కొట్టుకోవడం ఆగిపోయి, శ్వాస తీసుకోలేని స్థితిని చావుగా అర్థం చేసుకొంటాం. అయితే, మనిషి చనిపోయాక కూడా కొన్ని అవయవాలు పనిచేస్తూనే ఉంటాయి. అందుకే అవయవ దానం అనేది సాధ్యపడుతున్నది. అయితే, మనిషి చనిపోయాక కూడా అవయవాలు ఎలా పనిచేయగలుగుతున్నాయన్న దానిపై పరిశోధకులు తాజాగా ప్రయోగాలు చేశారు. జీవి మరణం తర్వాత కూడా అవయవాల్లోని కొన్ని కణాలు పని చేయడమే దీనికి కారణంగా గుర్తించారు. జీవం, మరణానికి మధ్యనున్న దీన్ని భిన్నమైన మూడో దశగా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. మరణించిన జీవి శరీరంలోని ఓ అవయవం నుంచి తీసుకున్న కణాలు.. ఒక మల్టీసెల్యూలర్‌గా ఏర్పడి మళ్లీ జీవం పోసుకోవడానికి అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు ఈ ప్రయోగం ద్వారా ఓ అవగాహనకు వచ్చారు. అదే జరిగితే, ఒకే జీవికి సంబంధించి జననం-మరణం-పునఃజననం అనే చక్రం సాధ్యమయ్యే అవకాశమున్నట్టు తెలిపారు.

**చావు గుట్టు వీడబోతున్నదా?**

'పుట్టక ముందు నువ్వెవరూ?.. మరణించాక ఏమౌతావు?' అనే తత్వపరమైన భావాలు, ఆత్మల ఊహాగానాలు, చావు గురించిన రహస్యాలు ఇప్పటివరకూ కథలుగానే ఉన్నాయి కానీ, శాస్త్రీయపరంగా ఎక్కడా రుజువైన దాఖలాలు లేవు. అయితే, పరిశోధకులు తాజాగా గుర్తించిన థర్డ్ స్టేట్‌తో చావు గురించిన గుట్టు ఒక్కొక్కటిగా విడిపోయే అవకాశం ఉన్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**ఎలా సాధ్యం?**

మనిషి చనిపోయాక కూడా ఆ కణాలు ఎలా పని చేస్తున్నాయి? ఏ మెకానిజం వాటిని అలా పని చేయనిస్తున్నది? అనే ఆసక్తికర చర్చ పరిశోధకుల్లో మొదలైంది. దీంతో మరింత లోతుగా పరిశోధించిన శాస్త్రవేత్తలు చివరకు ఓ నిర్ధారణకు వచ్చారు. మనిషి మరణించినప్పటికీ.. సరైన పరిస్థితుల్లో కణాలను భద్రపరిచినప్పుడు అవి తిరిగి జీవాన్ని పోసుకుంటాయని తేల్చారు. ఈ కణాలకు పోషకాలు, ఆక్సిజన్ అందించినప్పుడు అవి మల్టిసెల్యూలర్ వ్యవస్థగా ఎదుగుతాయని, జీవక్రియలను కూడా కొనసాగించగలవని తెలిపారు. మూలకణాల నుంచి జీవులను సృష్టించడం ఇదే తరహా విధానమని గుర్తుచేశారు. అంతేకాదు. జీవి మరణించినప్పటికీ ప్రాణంతో ఉండే కణాలు గతంలో తమ సజీవ శరీరంలో ఉన్నప్పుడు చేయలేని కొత్త పనులను కూడా చేయగలవని, వాటి ఆకారంలో కూడా మార్పులు వచ్చే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

**కప్పల్లో ఏం జరిగిందంటే?**

ప్రయోగంలో భాగంగా చనిపోయిన కప్ప చర్మ కణాలను తీసి ఓ ల్యాబ్‌లో ప్రత్యేక పరిస్థితుల్లో శాస్త్రవేత్తలు భద్రపరిచారు. ఆ కణాలు జెనోబాట్స్ అనే బహుళ కణ జీవిగా రూపాంతరం చెందడాన్ని గమనించారు. అయితే, కొత్తగా ఏర్పడిన జీవి గతంలో కంటే భిన్నంగా ప్రవర్తించడాన్ని గుర్తించారు. అంటే, కప్ప సజీవంగా ఉన్నప్పుడు స్రవాలను పంప్ చేయడానికి ఉపయోగపడ్డ సిలియా.. జెనోబాట్‌గా మారాక ముందుకు కదలడానికి సాయపడ్డట్టు గమనించారు. ఇక, మరణించిన మనిషి ఊపిరితిత్తుల్లోని కొన్ని కణాలను ప్రత్యేక పరిస్థితుల్లో భద్రపరిస్తే.. అవి సొంతంగా ఒక సూక్ష్మ రూపాన్ని సంతరించుకుని దానికదిగా పనిచేసుకొనేంత శక్తిని సంతరించుకొన్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు.